# తెలుగు సాహిత్యంలో హాస్యామృతం

(ప్రాచీన కాలం నుంచి నేటివరకు)

డా|| ద్వా. నా. శాస్త్రి



# తెలుగు సాహిత్యంలో హాస్యామృతం

## విమర్శనాత్మక విశ్లేషణ

**డా॥ ద్వా. నా. శాస్త్రి**

**కిన్నెర పబ్లికేషన్స్**

2-2-647/153, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ

హైదరాబాద్-500 013

ఫోను: 040-2742 6666, 98660 57777

**Telugu Saahityam lo Hasyamritam**
*(Comedy in Telugu Literature)*
(from Ancient time to update)

© Dr. Dwa· Na· Sastry

Cover Painting : Bali
Illustrations: Geeta Subba Rao
Cover Design : Haneef Shaik

First Edition : 15 June 2013

ISBN: 978-81-907279-9-0

*For Copies :*

Dr. Dwa. Na. Sastry
# 1-1-428, Archi's Nest
Gandhi Nagar
Hyderabad - 500 080
Cell: 98492 93376
&
Palapitta Books, Hyderabad
Phone: 040-2767 8430
and
All leading book shops

e-book: kinege.com

Printed at :
Charita Impressions
Azamabad, Hyderabad.
Ph.040-2767 8411

Price : ` 400
$ 20

# హాస్యం - కథా కమామిషూ

**"నవ్వవు జంతువుల్ నరుడు నవ్వును, నవ్వులు చిత్తవృత్తికిన్**
**దివ్వెలు, కొన్ని నవ్వులెటు తేలవు, కొన్ని విషప్రయుక్తముల్**
**పువ్వులు వోలె ప్రేమరసమున్ వెలి గ్రక్కు విశుద్ధమైనవే**
**నవ్వులు నాకు నిమ్మనఘ వినాశక! వ్యాధులు సోక వెన్నడన్"**

**– జాషువా**

నవరసాలలో హాస్యం ఒకటి. అసలు రసాలను గురించి ప్రపంచంలో మొదటగా విశ్లేషించి చర్చించింది మన భారతీయుడే, మన భరతుడే. 'నాట్యశాస్త్రం'లో ఇవన్నీ చర్చించిన మొనగాడు భరతముని.

"వాగంగాది వికార దర్శన జన్మావికాసాఖ్యో హాసః"

–వాక్, అంగాది వికారాల్ని చూడటం వల్ల కలిగే వికాసమే హాస్యం అన్నాడు 'రస గంగాధరం' రాసిన జగన్నాథ పండితరాయలు. మనలో కానీ, ఇతరుల్లో కానీ వుండే వికృత వేష భాషాలంకారాదుల్ని చూసినప్పుడు లేదా విన్నప్పుడు జనించేది హాసం.

అలంకార శాస్త్రాలు రాసిన వారు హాస్యం గురించి బోలెడు విశేషాలు వెల్లడించారు. అభినవగుప్తుడు ఇలా చెప్పాడన్నారు డా. పి.ఎస్.ఆర్.అప్పారావు– "ఒకడు నవ్వుచున్నప్పుడు హాస్య కారణమును మనము గుర్తింప లేకపోయినను, వానిని చూచి మనమును నవ్వుచుందుము. నవ్వుచున్న ప్రక్కవానిని చూచి మనమును హసన్ముఖులమగుచునే యుందుము. కాగా, హాస్యము సంక్రమణ స్వభావము కలదని తెలియవలెను. ఇట్టిది పరస్థమగును. ఇంక తాను ప్రత్యక్షముగా హాస్య కారణమును గుర్తించి నవ్వుట ఆత్మస్థమగును".

హాస్యం దేశ, కాల, అవస్థ, వయస్సు, లింగాది భేదాలను బట్టి ఏర్పడుతుంది. విటుడు, విదూషకుడు, రోగం, స్థూలకాయం, మత్తుడు, ఉన్మత్తుడు, వికలాంగుడు, వామనుడు... వీటి వల్ల హాస్యం పుడుతుంది లేదా పుట్టింపవచ్చు. భాషా ప్రయోగం వల్ల కూడా హాస్యం పుడుతుంది. నిరక్షరాస్యులు, పిల్లలు, వచ్చీ రాని భాషను మాట్లాడటం– ఇవన్నీ హాస్యానికి బీజాలే. మాండలిక భాషా పదాలు కూడా హాస్యాన్ని కలిగిస్తాయి. అవయవాల లోపం, ముఖ్యంగా నోటిలోపాలు అంటే బోసినోరు, తొర్రి నోరు, ముద్ద నాలుక గల నోరు, తొస్సి పెదవులు గల నోరు మొదలైన వాటి వల్ల నవ్వు పుడుతుంది. కవి చౌడప్ప అయితే 'బూతాడక నవ్వు పుట్టదు' అన్నాడు. మొత్తం మీద స్వభావ విరుద్ధాంశాలు నవ్వు పుట్టిస్తాయి.

నవ్వులు ఆరు రకాలని ఆలంకారికులు (అలంకార శాస్త్ర రచయితలు) చెప్పారు–

స్మితం: కొద్దిగా చెక్కిళ్ళు వికసింపజేసి మృదువుగా చూస్తూ, పళ్ళు కనిపించకుండా నవ్వటం

హసితం: మొహం, కళ్ళు, చెక్కిళ్ళు బాగా వికసింప జేసి పళ్ళు కనిపించేలా నవ్వటం.

విహసితం: ముఖరాగం చూపిస్తూ బయటకు రాని మధురస్వరంతో, ఓరగంట చూస్తూ మంద మందంగా నవ్వటం

అవహసితం: భుజాలను శిరస్సును కదుపుతూ ఓర చూపు చూస్తూ ముక్కు పుటాల్ని వికసింపజేస్తూ నవ్వటం

అపహసితం: కారణం లేకుండానే, కన్నీరు వచ్చేలా భుజాలు, వెంట్రుకలు కదిలేలా అదిరిపోయేట్టు నవ్వటం

అతిహాసం: కళ్ళ నుంచి కన్నీరు వచ్చేలా, డొక్కలదిరేటట్లు నవ్వటం

స్మితం, హసితం ఉత్తమమైన నవ్వులు. విహసితం, ఉపహసితం మధ్యమమైనవి. అపహసితం, అతిహసితం అధమమైనవి– అని చెప్పారు. తిక్కన నవ్వుగాని నవ్వు, సెలవి వార నవ్వు, పెద్ద నవ్వు... అంటూ చాలా నవ్వులు పేర్కొన్నాడు. ఆచార్య రవ్వా శ్రీహరి అన్నమయ్య కీర్తనలలో వందకు పైగా నవ్వులున్నాయన్నారు. 'హాస్యబ్రహ్మ' భమిడిపాటి కామేశ్వరరావు నవ్వు గురించి పరిశోధన చేసి చెప్పిన పలుకులివి–

"నవ్వేటప్పుడు ముఖం వికసించడం– కళ్ళు పెద్దవి అవడం, లేకపోతే సగం అవడం, కనుబొమలు పైకి జరగడం, దవడలు లేవడం, ఎడం అవడం, తలటెక్కింపు, ఝూడింపు, దంత దర్శనం, ఒక వేళ పళ్ళు పొడుగ్గా ఉంటే అప్పుడు వాటిని ఆచ్ఛాదన చెయ్యడం, ఇముడని కట్టు పళ్ళైతే వాటిని తీసి చేత్తో పుచ్చుకోవడం, భుజాలు ఎగరెయ్యడం, మెలికలు తిరగడం, దుంప తెగిపోనూ మొదలైన మాటలతో తిట్టుకేకలు, కూతలు, అరుపులు, చప్పట్లు, బాదులు ప్రక్క వాళ్ళని దిగిదోవడం, కళ్ళ నీళ్ళు తుడుచుకోవడం, పొట్ట నొప్పి తమాయించడానికి అబ్బ! అబ్బ! ఉండు, ఉండు అంటూ తెమలకుండా మాట్లాడడం వంటివి నవ్వే సమయంలో కనిపిస్తాయి".

నవ్వుల్లో కుక్క కూత నవ్వులు, కప్ప బెక బెకల నవ్వులు, గుఱ్ఱపు సకిలింపు నవ్వులు, 'గ్యాస్' నవ్వులు, రైలింజను నవ్వులు, దగ్గు నవ్వులు "కంటిన్యూ" నవ్వులు, మాయలపకీరు నవ్వులు ఏడిపించే నవ్వులు, ఆమోదం తెలిపే నవ్వులు, నిరసన నవ్వులు, వేదాంతపు నవ్వులు... ఇలా ఎన్ని ఉన్నాయో!!

ఒక్కొక్కసారి ఇతర రసాల వల్ల కూడా హాస్యం వస్తుంది. దీనినే రసాభాస అంటారు. ముసలి స్త్రీ పురుషుల మధ్య శృంగారం రసాభాస కాబట్టి నవ్వుకుంటాం. భారతంలో ఉత్తర కుమారుడు చూపించే వీర రసాభాస నవ్వు తెప్పిస్తుంది. "ఇప్పుడు నేను మిమ్మల్ని నవ్విస్తాను" అంటూ మాట్లాడినపుడు మనకి నవ్వు రానప్పుడు... అతన్ని చూసి నవ్వుకుంటాం.

హాస్యం దివ్యౌషధం అంటారు. మనసారా నవ్వగల వాడే మనిషి అన్నారు. Laughter makes good blood అనటమూ వుంది.

**"కాదు హాస్యమనిన గండ్రగొడ్డలి వేటు**
**సూది కాల్చిపెట్టు చురక కాదు**
**తగులకుండ దెబ్బతరలు రబ్బరు బంతి**
**మెదడు నిదుర బాపు మేలుకొలుపు"**

**"కత్తివోలె గాక – కవచమ్ము రీతిగా**
**వాడవలెను హాస్యవాక్కు లెపుడు**
**తాను దెబ్బ నుండి తప్పించుకోవలెగాని**
**పరుల మనసు గాయపరుప రాదు"**

అన్నారు నండూరి రామకృష్ణమాచార్య.

పదిమందిని ఏడిపించి, వందమందికి బాధ కలిగించి, వెయ్యిమందికి అపార్థం కల్పించి ఒక్కరిని నవ్వించడం హాస్యం  కాదు సుమా  అన్నారు. సంస్కారవంతమైన హాస్యం, చిత్తవికాసవంతమైన హాస్యం ఉత్తమ హాస్యం అవుతుంది. మనం వేసే 'చమక్కు'ను ఎదుటివాడు కూడా ఆనందించ కలిగి వుండాలి.

బెర్నార్డ్ షా అనుకుంటాను ఓ సభలో మాట్లాడుతూ "ఈ సభలో ఉన్నవాళ్ళల్లో సగం మంది మూర్ఖులే" అన్నాట్ట. చాలామంది లేచి గొడవ చేశారు. అప్పుడు "సారీ, ఈ సభలో ఉన్నవాళ్ళల్లో సగం మంది తెలివిగలవాళ్ళు" అన్నాట్ట. అందరూ సద్దుమణిగి కూర్చున్నారు. అదీ మంచి హాస్యం అంటే! ఇటువంటి మంచి నవ్వుల విలువ గురించి 1922 ఆగస్టు నాటి 'నవ్వుల తోట' హాస్యపత్రిక (మచిలీపట్నం నుంచి కోసూరు గురునాథ మూర్తి సంపాదకుడుగా వచ్చేది)లోని పంక్తులు గమనించండి:

**సిరిమించు రతనాల హారంబు కన్న**
**మేడలో నివసించి మిడుగుట కన్న**
**ధరణిలో ధనమును దాచుట కన్న**
**నవ్వుటే నవనవానందంబు మీకు**
**సొంపైన బంగారు సొమ్ముల కన్న**
**సభలలో బహుమతుల్జరగుట కన్న**
**కవులంచు బిరుదముల్లాంచుట కన్న**
**నవ్వుటే నవనవానందంబు మీకు"**

అయితే... నవ్వు వెనుక వేడి కన్నీరు వుంటుంది. నవ్వు వెనుక మన వెధవాయిత్వం వుంటుంది. నవ్వు వెనుక విమర్శ వుంటుంది. నవ్వు వెనుక తాత్త్వికత వుంటుంది– మనస్తత్వ శాస్త్రం వుంటుంది. చివరగా ప్రసిద్ధ రచయిత, దర్శకులు జంధ్యాల వారి మాటలు–

**నవ్వటం ఒక భోగం**
**నవ్వించటం ఒక యోగం**
**నవ్వలేకపోవటం ఒక రోగం**

**– డా. ద్వానాశాస్త్రి**

# ఇదీ వరస


1. పాసుపండ్ల వియ్యపురాండ్లు పండ్లే తోమరుగా...(జానపదం) .............................. 17
2. వీడా నాకొక కొడుకని గాడిద యేడ్చె...(చాటుపద్యాలు)........................................ 21
3. డబ్బిచ్చి కన్నీళ్ళు కొంటేనే మజా!...(ఆశు కవిత్వం) ............................................ 26
4. 'సంధ్య వార్చెను సాహెబు చర్చియందు'...(చమత్కార పద్యాలు).............................. 32
5. బారులో పడితే డోరు డెలివరీ...(కె.వి.రమణాచారి సిద్ధాంత వ్యాసం)......................... 36
6. కోరమీసము మెలిబెట్టె కోమలాంగి!...(అవధాన కవిత్వం)........................................ 42
7. "కవులలోపల బమ్మ రాకాసి వీవు"...(కవుల నవ్వులు).............................................. 47
8. వర్జ్యం లేకుండా చూసి రైళ్ళు నడపాలి...(కందుకూరి వీరేశలింగం) .......................... 52
9. వెధ్వల్ అన్నది లాటిన్ మాటండి ఆ మాటకర్థం కచేరీలు...(గురజాడ) ........................ 57
10. అచ్చుపొల్లులపై నుంచునతడు కవియే?...(ప్రహసనాలు) ........................................... 60
11. తాజ్‌మహల్ కన్నా గొప్పవి పెసరట్టు, పలావు...(పానుగంటి) ...................................... 63
12. 'ఒక అచ్చరనచ్చ యీనాం... అదీ సారాశెంబు'...(వేదం వెంకటరాయశాస్త్రి) ................. 67
13. కోటికి పడగెత్తించే లింగరాజు సూత్రాలు...(కాళ్ళకూరి నారాయణరావు) ..................... 71
14. 'ఏ కాకి చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం'...(జరుక్ శాస్త్రి)............................. 76
15. సన్మార్గం గుండా – పండిత గుంట...(మాచిరాజు దేవీప్రసాద్)...................................... 81
16. అమ్మాయికి అనారోగ్యమా! సంతోషం...(భమిడిపాటి కామేశ్వరరావు) ........................ 85
17. ఎన్ని కూరలు కొన్నాడో యేమొ కాని...(విశ్వనాథ)..................................................... 89
18. నిరుడు శ్రావణ శుక్రవారం 'సండే' వచ్చింది...(విశ్వనాథ)............................................ 94
19. తాటాకుల కట్ట – కచ్చికల పొడి – కుడికాలు...(మొక్కపాటి నరసింహశాస్త్రి)................. 98
20. నిన్న చచ్చిన గుర్రం ఇవాళ వచ్చింది...(మునిమాణిక్యం)............................................ 102
21. నవ్వే జనాః సుఖినోభవన్తు...(రావూరు వేంకట సత్యనారాయణ)................................ 106
22. కవి వరాహ... కవి గార్దభ... కవి శునక...(శ్రీశ్రీ)... ...................................................... 110
23. భార్యకు పట్టుచీర... భర్తకు వంకాయ కూర!...(ఆరుద్ర) ............................................. 115
24. బారు పెట్టిన వాడు బీరు పోయడా!...(ప్యారడీ కవిత్వం)............................................ 120
25. గొయ్యి తవ్వుదాం – దేవుడు గుర్తొస్తాడు...(లేళ్ళపల్లి వెంకట లక్ష్మీనారాయణ)............ 124
26. 'మైగాడ్!' పుస్తకాలు కొనడమా!...(ముళ్ళపూడి) ......................................................... 128
27. "మీ అనారోగ్యమే మా మహాభాగ్యం"...(యఱ్ఱంశెట్టి శాయి)......................................... 133

28. గత జన్మలో శత్రువు ఈ జన్మలో ఇల్లాలు!...(ఆదివిష్ణు) ...................................... 138
29. రెడీమేడ్ రైటర్ – చనుబాల కవి కిష్టయ్య...(గోపాల చక్రవర్తి)........................................ 142
30. 'రేపటిలోగా దయచేసి కొంచెం మరణించాలి'...(భమిడిపాటి రాధాకృష్ణ)...................... 147
31. 'షష్టిపూర్తి' అయింది గాని 'ముష్టిపూర్తి' ఇంకా కాలేదు!...(అబ్బూరి వరదరాజేశ్వరరావు).... 151
32. బనీనుకి స్త్రీలింగం బాడీ!...(పురాణం సీత).......................................................... 155
33. అత్తగారి నవ్వుల తోట...(భానుమతి) ................................................................. 159
34. నా దండను నేనే తెచ్చుకుంటా...(రావికొండలరావు) ............................................ 164
35. నసగాడొస్తున్నాడు జాగ్రత్త!...(భరాగో) ............................................................ 169
36. 'పిటపిటలాడెను నీ పరువం...'...(నం.పా.సా.) ................................................ 174
37. బయట వద్దయ్యా... అక్కడ మా వాడున్నాడు!...(గొల్లపూడి మారుతీరావు) ..................... 178
38. 'పారసైటులు రీసెర్చి గైడులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి'...(కవనశర్మ) ........................ 182
39. కాకీకే కాకికి కోక...!...(ఆచార్య తిరుమల సంకలనం)................................................ 185
40. శ్రాద్ధం, తద్దినం మంచివే!...(భాషా చమక్కులు) ........................................................ 190
41. రోటీ, కపడా, మకాన్ ఔర్ మొబైల్ ఫోన్...(శ్రీరమణ) ................................................. 195
42. రవికలో దాగున్న ఇద్దరెవరు?...(ఆమళ్ళదిన్నె గోపీనాథ్) ............................................. 200
43. అయితే వెళ్ళి గోదావరిలో దిగు...!...(శంకరమంచి పార్థసారథి)..................................... 205
44. ఆ మొగుడూ ఒక మొగుడేనా?...(గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు) ................................ 209
45. 'మీరు ఎట్టన్న జేసి నాకు పాస్ మార్కులు ఎయ్యండ్రి'...(తెలిదేవర భానుమూర్తి)............ 213
46. వీధిలో సౌందర్య, ఇంట్లో సూర్యకాంతం!...(వంగూరి చిట్టెన్‌రాజు)................................ 217
47. "చీకటిలో ఉన్న మజా అనుభవించితే తెలియునులే"...(శంకర నారాయణ)....................... 221
48. 'దాలే దర్బారే షెహన్ షా'...(పొత్తూరి విజయలక్ష్మి).................................................. 224
49. రా... రా... రామా... రా!...(ఎమ్బీయస్ ప్రసాద్)...................................................... 228
50. సెల్లు ఫోను గోల చెప్పతరమె!...(గుమ్మా సాంబశివరావు).......................................... 232
51. ఆ రోగమే మహాభాగ్యం!...(సుధామ) .................................................................. 236
52. గోకు వెడ్స్ గీకు...(రాంపా)................................................................................ 241
53. విద్యుత్ కోత వర్ధిల్లాలి...(ద్వానా)....................................................................... 244
54. జ్ఞానపీఠంపై ప్రముఖులు ఒక పేరడీ...(ద్వానా)......................................................... 247
55. ద్వానా శాస్త్రి గురించి... .................................................................................... 249

***

# పాసుపండ్ల వియ్యపురాండ్లు పండ్లే తోమరుగా

నవరసాలలో హాస్యమొకటి అని తెలిసిందే. మన ఆలంకారికులు మన హాస్యాన్ని ఆరు విధాలుగా విభజించి హాస్యానికి ఎంతో ప్రాధాన్యమిచ్చారు. అయితే ఈ హాస్యరసాన్ని అన్ని రకాలుగా అనుభవించివారు జానపదులే. వారిది స్వచ్ఛమైన హాస్యం. అడ్డుతెరలూ, పొరలూ లేని హాస్యం అది. జానపద సాహిత్యాన్ని పూర్వీకులు సాహిత్యంగా పరిగణించలేదు. ఆధునిక యుగంలోనే జానపద సాహిత్యానికి ప్రాచుర్యం, స్థాయి లభించింది. నాగరికుల హాస్యం జానపదులంత స్వచ్ఛం కాదు.

అసలు ఏ భాషా సాహిత్యంలోనైనా ముందు పుట్టేది జానపద సాహిత్యమే. ఆ తర్వాత లిఖిత సాహిత్యం పుడుతుంది. జనం గుండెల్లో గూడు కట్టుకొనేది, మారుమ్రోగేది జానపద సాహిత్యమే. జానపదుల సహజ సుందరమైన హాస్యం వల్లనే ఆనాటి వారికి ఇన్ని వ్యాధులు రాలేదు. మానసిక ప్రశాంతతను, శారీరక ఆరోగ్యాన్ని సమకూర్చేది నవ్వు మాత్రమే అనీ ఇటీవలి విజ్ఞానశాస్త్ర పరిశోధకులు తేల్చారు. అటువంటి జానపదులు – మన పూర్వీకుల హాస్య ప్రియత్వాన్ని కొంత నెమరు వేసుకొందాం.

పౌరాణిక గేయాలలో కూడా హాస్యం జానపదులకి ఇష్టం. 'ఊర్మిళాదేవి నిద్ర' అని ఒక పౌరాణిక గేయం వుంది. లక్ష్మణుడు వనవాసానికి వెళ్ళిన తర్వాత అతని భార్య ఊర్మిళాదేవి 'మహానిద్ర' పోయింది. రావణుడ్ని సంహరించి సీతతో రాముడు పట్టాభిషిక్తుడైన తర్వాత లక్ష్మణుడు ఊర్మిళాదేవి దగ్గరికి వెళ్తే – ఆవిడ గుర్తుపట్టదు. అప్పటి సంభాషణ చూడండి!

**"శ్రీరాము తమ్ముండనే – అతడనగ సృష్టిలో నొకరుగలరా?"**
**"జనకులల్లునిగానటే – భూమిలో జనకులనగానెవ్వరూ?"**
**"సీతమరదినిగానటే – చేడెరో దయయుంచి మేలుకొనవే"**

ఇలా అంటూ చివరికి లక్ష్మణుడు కత్తితో తలపై వేటు వేసుకోబోతుండగా ఊర్మిళాదేవి తన భర్తగా గుర్తిస్తుంది. ఇదంతా జానపదులు హాస్యానికి, చమత్కారానికి కల్పించుకొన్నదే!

గంగా – గౌరీ సంవాదం, లక్ష్మీ – పార్వతి సంవాదం, సవతులకయ్యం మొదలైన పాటలలో హాస్యం ఉంది. 'ఆండాళు చరిత్ర' అనే జానపద గేయంలో భోజనాలకు సిద్ధమైన బ్రాహ్మణుల భాషణలో హాస్యం ఎలా ఉందో చూడండి –

**'సుబ్బంభొట్లూ విన్నావిషరా, చూడికొత్త పెళ్ళిషరా**
**అబ్బాయిని అచ్చయ్యను, మరి మన అవధాన్లను కేకెయ్‌రా**

**సంతర్పణలష సంతసమొదవగ, గొంతు వరకు తిందాం**
**ముంత మామిడి పప్పు మిషాయిష ముందు మనము పోదాం!"**

మరొక జానపద గేయంలోని సరస హాస్యం ఇది –

**'పొట్లపాదులకి పిందెలందమ్మ – కాట్ల కుక్కమగడు కాంతకందమ్మ**
**తోటకూర కంబమూ దొడ్డి కందమ్ము – మావారి పొగచుట్ట నాకానందమ్మ**
**వెనుక దిక్కు లేకుంటే వెలదికందమ్మ – మస్తుగ తింటేనె మగువకందమ్ము**
**దొంగ మగనికి పెంకి పెండ్లామందమ్ము...!'**

దశావతారాలను ఉపయోగించి, బంధువులతో పోల్చి చెప్పిన ఈ జానపద గేయం మీకు నవ్వు పుట్టించకుండా వుంటుందా??

**'మా పాప మామల్లు మత్స్యావతారం**
**కూర్చున్న తాతల్లు కూర్మావతారం**
**వరసైన బావల్లు వరహావతారం**
**నట్టింట నాయత్త నరసింహావతారం...'**

పూర్వం బావ ఇంటికి వస్తే ఆటలు పట్టేవారు. ఎన్ని వేళాకోళాలో! ఎన్ని సరదాలో! అవన్నీ అనురాగమయాలే! ఆ సన్నివేశాలు "క్యా సీన్ హై" అనేలా వుంటాయి. ఒక గేయం –

**'బావా బావా పన్నీరు – బావను పట్టుక తన్నేరు**
**వీధివీధి తిప్పేరు – వీశెడు గంధం పూసేరు**
**చావడి గుంజకు కట్టేరు – చప్పిడి గుద్దులు గుద్దేరు'**

ఆడపిల్ల పెళ్ళయిన తర్వాత అత్తవారింటికి పంపుతూ 'అప్పగింతలు' అనే కార్యక్రమం వుంటుంది. కాళిదాసు నుంచి నేటి వరకు చాలామంది ఈ అప్పగింతలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మరి వేడుకలకి, సంబరాలకి ప్రాధాన్యం ఇచ్చే జానపదులు దీనికి ప్రాధాన్యం ఇవ్వకుండా ఎలా వుంటారు? ఈ పంక్తులు చదవండి –

**'అత్త మామలు గాని ఆడుబొట్టెలు గాని – లేరమ్మ నీదెంత పున్నెమోగాని**
**మగడొక్కడేగాన మనసు కెక్కినయట్లు – మర్దించి నీ వశము చేసికోవమ్మా**
**నీ మాట వినబడ్డ నిమిషంబునందు – అదలిపోయేటట్లు అతని భయపెట్టు**
**ఇరుగుపొరుగు వారలేమైనా అంటే – యేద్వక వేయిరెట్లు దుమ్మెత్తిపొయ్యి!!'**

హాస్యం అనేది పొడుపు కథల రూపంలోనూ వుంటుంది. వాక్చమత్కారం ద్వారా అపార్థం కల్పించి – తర్వాత ఆనందాన్ని కలిగించే పద్ధతి జానపద గేయాల్లో కనిపిస్తుంది. ఈ గేయంలో స్త్రీ పురుషుల సంభాషణ ఎంత 'రంజు'గా సాగుతుందో పరిశీలించండి.

స్త్రీ : ఒకరీకి చెయినిచ్చి – ఒకరీని కాలునిచ్చి
ఒకరీకి నడుమునిచ్చి – కూకున్న నోయి రాజా!

పురుషుడు: ఎవరికి చేయినిచ్చి – ఎవరికీ కాలునిచ్చి
ఎవరికి నడుమునిచ్చి – కూకున్నవోయ్ జాణ!

స్త్రీ : గాజుల్కు చేయినిచ్చి – అందెల్కి కాలునిచ్చి
వడ్డాణానికి నడుమునిచ్చి – కూకున్ననోయి రాజా!

ఇందులో మొదట అనుమానపు పలుకులు, అప్రియవచనాలు ఉన్నా సమాధానం చెప్పగానే ఆ అనుమానం పోయి ప్రియమైంది.

నల్లిమీదా, కల్లుమీదా, పొగచుట్ట మీదా, నస్యం మీదా చాటు పద్యాలు చెప్పడం మనకి తెలిసిందే. అయితే జానపద కవిత్వంలో కూడా ఈ విధమైన గేయాలున్నాయి. ఒకడి 'నస్యపుకాయ' పోయింది. అంటే ముక్కుపొడి వేసుకునేకాయ! దానికి ఏడుస్తూ చెప్పింది ఇది –

**"పోతీవి గదవే నా ముద్దుకాయ**
**పోతీవి గదవే నా నస్సపుకాయ**
**కట్టాపోవకు పొడి పొట్టానిండాబోసి**
**పిట్టావలె నిన్ను పట్టూకు తిరుగుదు ॥పోతీవి॥**
**తులమువెండిపెట్టి గజ్జేలు చేయిస్తి**
**అప్పు తీరక ముందె చెప్పాకపోతీవి ॥పోతీవి॥**

మానవ జీవితంలో పెళ్ళి ముఖ్యమైన ఘట్టంగదా! జానపదులు పెళ్ళిపాటల్ని సృష్టించారు. అందులో పెళ్ళికొడుకు మీదా, వియ్యాలవారి మీదా ఎన్నో వేళాకోళాలూ, విసుర్లూ ఉంటాయి. కొన్ని సున్నితంగా వుంటే మరికొన్ని మోటుగానూ వుంటాయి. పెళ్ళికొడుకు లక్ష్యంగా చేసుకొన్న పాట ఇది –

**"ఎక్కడ దొరికి నాడమ్మా ఈ పెళ్ళికొడుకు**
**అద్దెడు మానెడు పోసినాము – అరిసెలైన వండినాము**
**అంగుడైన జూపడాయె – అరమొగము పెళ్ళికొడుకు**
**అయిదువేలు పోసినాము – అత్తరు పన్నీరు దెచ్చినాము**
**చల్లుకోవటం చేతగాదు – చవటమొగం పెళ్ళికొడుకు"**

కోలాటం పాటల్లో సరసమైనవి ఉన్నాయి. భార్యాభర్తల మధ్య అనుమానం వుంటే అది పెనుభూతమే మరి! ఈ కిందిపాట భార్యాభర్తల మధ్య జరిగే సరస సంభాషణలో మనసును గిలిగింతలు పెడ్తూ రసానందం కలిగిస్తుంది.

భర్త : "గట్టాకుబోయి నేను కట్టేలు తెమ్మంటే
కొప్పునున్నా పూలు ఎక్కిడివే భామ? నీ
కొప్పునున్నా పూలు ఎక్కడివె భామ?
ఆత్తేరి పూలు ఎక్కడివె భామ?"

భార్య : గాలిధూలి వచ్చి గంపంత మబ్బొచ్చి
కొమ్మ ఊగి కొప్పు నిండింది మగడా
నాతోడు రంకాడలేదు – నీతోడు రంకాడలేదు

భర్త : చెంపనున్న కాట్లు ఎక్కడివె భామ? నీ
చెంపనున్న కాట్లు ఎక్కడివె భామ?
ఆత్తేరి కాట్లు ఎక్కడివె భామ?

భార్య : కోమటోరింటికి కొబ్బరికి బోతేను
తక్కెట్ల గుండొచ్చి తగిలింది మగడా
నా తోడు రంకాడలేదు – అమ్మతోడు రంకాడలేదు.

ఒకడు గడ్డం మీద పాట అల్లాడు. ఆ పాట ఇలా మొదలవుతుంది –

**'మా మామ గడ్డాము బవిరి గడ్డాము**
**యిదిలిచ్చి చూస్తేను యీపి పేనుండు**
**పారపట్టి చూస్తేను పందికొక్కుండు!'**

ఒకరిని మించి మరొకరు ఎకసక్కెం ఆడుతూ పాడే పాటలో 'ముక్తపదగ్రస్తం' అనే అలంకారం కూడా వుంది –

**'నాచుల యుండే మీసము దువ్వే రొయ్యి పీతగారూ**
**రొయ్యి పీతకే మొనగాడండీ మట్టగిడస గారూ**
**మట్టగిడసకీ మొనగాడండీ ఎంద్రకాయగారూ!**
**ఎంద్రకాయికే మొనగాడండీ నక్కపోతుగారూ'**

చివరగా పెళ్ళిలో వియ్యాలవారి పాటను చదివి చక్కగా నవ్వుకుందాం. జానపదుల స్వచ్ఛమైన, సహజమైన సరసత్వాన్ని ఆస్వాదిద్దాం :

**'పండ్లపుల్లలు పదిబిందెలనీళ్ళు – విడిదీకి పంపితిమీ**
**పాసుపండ్ల వియ్యపురాండ్లు – పండ్లేతోమరుగా**
**వేడినీళ్ళు సబ్బుబిళ్ళలూ – విడిదికి పంపితిమీ**
**మురికి వంటి వియ్యపురాండ్లు – స్నానము చెయ్యరుగా**
**అద్దము దువ్వెన వాసననూనెలు – విడిదీకి పంపితిమీ**
**బట్టతలలా వియ్యపురాండ్లు – తలలే దువ్వరుగా'**

***

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1851**

* * *

Read other books by Dr. Dwa.Na. Sastry @

**http://kinige.com/kbrowse.php?via=author&name=Dr.+Dwa.+Na.+Sastry&id=655**